# కన్య స్వగతం

రచన:
''మాధవ్'',

అది రాత్రి 10 గం. ల సమయం, ముహూర్తానికి ఇంకా అరగంట వ్యవధి ఉంది. పెళ్ళిపందిరి అంతా చాల గందరగోళంగా సందడిగా ఉంది. విద్యుద్దీపాల వెలుగులో కనుల పండువుగా ఉంది. ముత్తయిదువలు, కన్నెపిల్లలు, గృహిణులు, ముసలివారు అందరు ఎవరిమట్టుకు వాళ్ళు గుంపులు గుంపులుగా చేరి ఏవేవో మాట్లాడుకుంటున్నారు. మగవాళ్ళు సిగరెట్లు కాల్చుకుంటూ ప్రస్థుత రాజకీయ విషయాలు మాట్లాడుకుంటున్నారు. మగపెళ్ళివారు ఎవరు ఎక్కువమంది లేనందున తగువులు లేవు. వచ్చిన వాళ్ళని ఆదరించడం కష్టంలేదు. భజంత్రీలు మారుమ్రోగుతున్నాయి. స్త్రీలందరు పట్టుచీరలు కట్టుకొని క్రొత్త క్రొత్త అలంకారములలో ఫేషన్ పెరేడ్‌లాగ తమ పట్టుచీరలు గరగరమని శబ్దం చేసుకుంటూ పని ఉన్నా లేకపోయినా అటూ ఇటూ తిరుగుతున్నారు. వధువు గౌరీ దేవిని తన భవిష్యత్‌ని తీర్చి దిద్దమని పూజిస్తోంది. పురోహితుడు మంత్రోచ్ఛరణ చేసి పూజచేయిస్తున్నాడు. వీటి అన్నిటిలో శారీరకంగా సంబంధం ఉన్నా మానసికంగా శారద తన జీవితాన్ని నెమరువేసి కొంటోంది. అయ్యో! ఇంక కొన్ని క్షణాలలో నేను భాద్యతలుగల గృహిణ్ని అయిపోతున్నాను. ఇంకెవరైయినా అయితే ఎంతో సంతోషించేవారు. నాకు మాత్రం ఇలా ఉందేమిటి? చిన్న తనం నుండి తండ్రితో ఎవరైనా వెళుతూ ఉంటే అలాటి అదృష్టం లేదుకదా అని బాధపోయేదాన్ని. నా ఊహ తెలియని వయస్సులోనే అతను వెళ్ళిపోయేరు. ఇంక అమ్మ ఆవిడ ఒక సృజీవ ప్రతిమ, తనకి తానుగా ఏమి చెయ్యలేనిది. ఎవరి దయాదాక్షిణ్యాలలోనో బి. ఎ. చదువుతున్నాను. ఇంక అన్నదమ్ములా ఎక్కడైనా ఉద్యోగం చేస్తే వాళ్ళ పరువు ప్రతిష్టలకి భంగం అని భావించి ఉద్యోగం చెయ్యనివ్వరు. పోనీ అందరిలా పెళ్ళిచేసి తమ భాధ్యత తీర్చుకుందికి ఎవరికీ సమర్థత లేదు, అంత ఓపికా లేదు. అందులో ఈ రోజుల్లో వరకట్నాలు ఒక సమస్యగా నిలిచి నాలాటి అభాగినులను ఎందరినో బలితీసుకుంటున్నాయి.

పెద్దవాడు ఎప్పుడో నా చిన్నతనంలోనే వివాహం చేసేసుకొని స్థిరపడిపోయేడు. వాడికి నేను బ్రతికి ఉన్నానో లేదో కూడా అవసరం లేదు. ఇంక రెండోవాడు తను ఇంతవరకూ ఎందుకు పెళ్ళిచేసుకోలేదని ఎవరైనా అడిగితే ఏవేవో ఆదర్శాలు భాధ్యతలు వర్ణించి చివరికి ఎవరికి చెప్పకుండా అమ్మా! నీకోడలిని దీవించు అని వెన్నెల పిసని కర్రని తీసుకొచ్చేడు. ఇంక మూడోవాడు, నాల్గోవాడు సర్వ స్వాతంత్రులు, ఇంకా ఆలోచిస్తున్నారు వాళ్ళ ఊహాసుందరిని ఎన్నుకోడానికి.

అమ్మ ఎప్పుడైనా 'ఒక్క గాని ఒక్క ఆడపిల్ల, దాని సంగతి ఏది ఆలోచించినటు?'' అని అడిగితే, దానికేం తక్కువ చేసేం, బి. ఏ. దాక చదువు చెప్పించాం అంటారు, పాపం వాళ్ళు కష్టపడి చెప్పించినట్టు. బట్టలు కొంటున్నారు పాపం వాళ్ళపెళ్ళాలకి చీరలు, వాళ్ళ సూట్లకి ఖర్చు అవగా 10 రూ. పెట్టి చీరకొని ఇది ఒంట్లోకి బాగుంటుంది, స్థిమితంమీద మంచిది కొనుక్కుందాం అంటారు, ఆ స్థిమితం ఎప్పుడో కనుచూపు మేరకనపడ లేదు. ఆడపిల్లకి ఆవు దూడలాగ ఇంత మేత, మానం కాపాడుకోడానికి ముతకో సన్నమో బట్టఇస్తే

(తరువాయి 19 వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

వాళ్ళ బాధ్యత తీరిపోయినట్టే భావిస్తారు. వీళ్ళ సంగతి నాకు తెలియనట్టు. వీళ్ళ భాగవతాలు వింటే తెలుస్తుంది. నేను ఆడదాన్ని కాబట్టి పడి ఉన్నాను. నేనూ వాళ్ళలా ప్రవర్తిస్తే వీళ్లు బుర్ర ఎక్కడ పెట్టుకోవాలో ఆలోచించరు. పెళ్ళివిషయం ఎత్తేసరికి పెద్దవాడు నెమ్మదిగా జారుకుంటాడు, చిన్నవాడు గడుసువాడు అమ్మ నోరు అతినేర్పుగా మూయిస్తాడు. అమ్మా! అంతా డబ్బుతో పని. అది బి. ఎ. చదివింది దీనికి తగిన సంబంధం దొరకడం మాటలా? అన్నిటికి డబ్బు కావాలి మనకి అంతడబ్బు ఎక్కడిది? అని అమ్మని చల్లబరచి విషయం వాయిదావేసి తప్పుకుంటాడు. అమ్మ మనకి డబ్బు వచ్చేసరికి దాని వయస్సు మరీ మీరి పోతుంది, అప్పుడు సంబంధాలు దొరకొద్దా? అని అంటే నేను ఒక్కడినే ఉన్నానా మిగిలిన అందరితో చెప్పు వాళ్ళు డబ్బు సమకూరిస్తే నేను సంబంధం నిమిషాలమీద కుదురుస్తాను అంటాడు.

ఇప్పటికే అంటే నాకు 30 సం. వచ్చేసరికి ఈ సంబంధం పెళ్ళిళ్ళ పేరయ్య ధర్మమా అని 4 గురు పిల్లలతో 40 ఏళ్ళ వరుడు దొరికేడు. ఇంక నేను కోరేది ఏవికాదని తలవంచక తప్ప లేదు. అబ్బ? ఏం దీక్షగా పూజచేస్తోందమ్మా! ఈ నలుగురిని ఎలా వదిలించుకోడం అనా? లేక ఈ రెండో పెళ్ళి మొగుడిదగ్గర పుట్టిన దగ్గర నుంచీ కరువైనవన్నీ వగలుపడి ఎలా సమకూర్చుకుందాం అనా? లేక ఇంకేం ఆలోచిస్తోందో? చదువుకున్నది కదా? వీళ్ళ నందరిని సరిగా చూస్తుందేవిటి? వీళ్ళ కూడా గుమ్మంలోనే! అనే అమ్మ లక్కల సానుభూతి మాటలు చెవుల పడుచున్నాయి. ఏం సమాధానం చెబుతుంది. పాపం! నేనే రావాలని, నేనే కావాలని ఎవరు నాకోసం ఎదురు చూడటం లేదు. జీవితంలో అనుభవించవలసినవన్నీ అనుభవించి ఇంక మిగిలిన జీవితంలో తనకి, తనపిల్లలకి ఇంత వండి పెట్టే నమ్మకమైన పనిమనిషిని ఎన్నటికీ విడని బంధంవేసి తీసుకువెళ్ళే ప్రయత్నంలో ఆతను తనని పెళ్ళిచూపులనాడు వేసినప్రశ్నలు అన్నీ కళ్ళకి కట్టినట్టు జ్ఞాపకం వస్తున్నాయి. అమ్మాయి, దీపందార పొయ్యి అక్షింతలు జల్లు. కుంకంతీసి బొట్టు పెట్టుకో అంటూ అన్న పురోహితుడి మాటలతో శారద మళ్ళీ ఈ లోకంలో వచ్చి పడింది.

అమ్మలక్కల గుసగుసలు. చెవుల పడుతున్నాయి వీరందరికి ఇతరులని నొప్పించడం ఒక అలవాటు. అందుకు కొంచెం వినపడేలాగే అంటున్నారు. ఆ మొదటి పెళ్ళి, పెళ్లికొడుకే అయితే ఇంకా ఈవిడ ఆలోచనలకి హద్దే ఉండదు. ఏం సుఖపడదాం అని ఆలోచిస్తోంది. ఆ! ఇక్కడికన్న నయం ఒదినగార్ల ఆరళ్ళు ఉండవు. అందుకు స్వతంత్రంగా జీవితాన్ని ఎలా వెలిగిద్దామా? అని కాబోలు అని ఎవరికి తోచనట్టు వాళ్ళు అనుకుంటున్నారు. అయ్యో! వీళ్ళు అనుకొనేవి ఒకటైనా నిజమా? కాదని కాదని ఎలా చెప్పను. ఈ పిల్లలందరిని నీ పిల్లలుగా పెంచాలి, నాకు దగ్గర కావాలంటే పిల్లల్నికన్న తల్లిలా చూడాలి, నీకున్న కోర్కెలలో కొన్ని త్యాగం చేస్తేనే తప్ప నాకువచ్చే 500 రూ॥ లో సంసారం సవ్యంగా సాగదు. బి. ఎ. దాక చదివేను వంట అది రాదంటే తరువాత నౌకర్లని పెట్టేందుకి నాజీతం సరిపోదు. నేను ఉద్యోగం చేస్తానంటే నేను ఎన్నడు అంగీకరించను చదువుకున్న దానివి పిల్లల్ని కాస్త చదువు అది చెప్పి క్రమశిక్షణలో పెంచుతావని, నీకు ఎలాగు పిల్లలు పుట్టే అవకాశం లేదు కాబట్టి నానా భేదం లేకుండా ఉంటుందని నా

ఉద్దేశం. అంటే నేను విసక్త మీ చేసుకున్నాను. ఇవన్నీ నీకు అంగీకారం అయితేనే ముందుకు సాగడం. పెద్దల నిర్బంధంవల్ల అయితే ఆ తరువాత శ్రమపడేది మనం. అందుకు ఆలోచించి చెప్పు అని అతను అన్నవన్నీ నాకు మతి భ్రమింప చేసేయి. నేను త్యాగం చెయ్యాలి. నేను సేవలు చెయ్యాలి. ఒకరు కన్న పిల్లల్ని తల్లినై పెంచాలి. ఇవన్నీ చేస్తే నన్ను ఉద్ధరించి నాకన్న చెఱ విడిపించి నాతాత తండ్రులను తరింపచేసి నన్ను వివాహం చేసుకోడానికి ఈ పుణ్యాత్ముడు ముందుకి వస్తాడు. బాగుంది వరస. ఇంకా సంబంధం కుదరకుండానే ఏకవచన ప్రయోగం, దీన్నిబట్టి తెలుస్తోంది. అతని సంస్కార, అందుకే ఆడదాన్ని ఆరిటాకుతో పోల్చేరు. నేను ఒక మనిషిగా జీవించడంలేదని, యాంత్రికంగా ప్రాణం ఉన్న బొమ్మలా ఉన్నానని అతనికేం తెలుసు. కోరికలంటూ ఉంటే కదా? కొన్ని త్యాగం చెయ్యడానికి? ఉన్న ఒక్క కోర్కె ఎవరితోనూ అనడానికి కూడా అవకాశం లేదు. అతను ఒక్కసారి మళ్ళీ జీవితంలో కలసి ఈ ప్రేమపుష్పాన్ని గ్రహించి, నా నిరీక్షణని తెలిసికొని తనకై నలిగి నశించిన ఈ అభాగ్యురాలిని ఒక్క చల్లని మాటలో ఓదారుస్తే చాలు అందుకే ఈ వ్యర్థజీవితం సాగించడం. హే! పరమాత్మా! ఏ ఒక్క కోర్కె తీరకపోయినా అతనికీ నా మనస్సుని తెలిసినా నిరీక్షణని, నా ఓటమిని తెలిపే అవకాశం కల్పించు అని మనసారా భగవంతుణ్ని కోరుకుంటూ ఉండగా పురోహితుడు అమ్మా! పందిట్లోకి వెళ్ళాలి అని తొందరచేస్తు అన్న మాటలు వినిపించి యాంత్రికంగా లేచి అమ్మలక్కల సహాయంతో పందిట్లో వరుని ప్రక్కన కూర్చుంది. కొంత పూజ, మంత్రోచ్చారణ అయిన తరువాత వరుడు మాంగల్య ధారణకోసం మంగళసూత్రం పట్టుకొని నిలబడి పురోహితుడు చెప్పిన మంత్రాలు చెబుతున్నాడు. నన్ను నేను ఒకరికి సమర్పిద్దామని అనుకొని ఇంకొకరికి అంకితం అయిపోతున్నాను. నా కర్తవ్యం నిర్వహణలో లోపం రానియ్యకు గుట్టుగా జీవితం సాగిపోనీ; నా జీవితంలో నేను ఎవరి ప్రేమను పొందలేదు, నాకు మమకాను రాగాలు పంచడమేగాని పొందేవరం లేదు. వచ్చే జన్మకైనా బాధ్యతలెరిగిన తల్లి తండ్రులని, మమతా మమకారాలున్న సహజన్ములను ప్రసాదించు వివాహజీవితంలో నాలోనే ప్రవేశించి, నాలోనే సాగించి, ఆ సౌఖ్యం నాకు చవిచూపించి నా వల్ల సుఖసంతోషాలను పొందే భర్తను ప్రసాదించు అని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ ఉంటే వరుడు వంగి శారద మెడలో మూడుముళ్ళూ వేసాడు. దాంతో త్రుళ్ళిపడి గత జీవితానికి స్వస్తి చెప్పి ఇంక నేను కన్యనికాను కలలు కనడానికి. బాధ్యతలు గల గృహినారి, నా కర్తవ్య నిర్వహణలో లోపం రానియ్యకు అయ్యో! నేను ఇంకా బ్రతికి ఉన్నానంటే ఇన్ని బాధ్యతలు నెత్తిన పెట్టుకుందికే కాబోలు అని అనుకొని శారద ఈ లోకంలోకి వచ్చి ఆలోచనలు మాని పురోహితుడు చెప్పినట్టు చేస్తోంది. అపశకునాలు తుమ్ములు, దగ్గులూ వంటివి వినపడకుండా భజంత్రీలు మిన్నుముట్టి మ్రోగుతున్నాయి. పెళ్ళిపందిరి అంతా కోలాహలంగా ఉంది. ఎవరి ఊహలు ఆపోహలు ఎలా ఉన్నా, ఎవరి కోరికలు, ఎలా ఉన్నా జగన్నాటక సూత్రధారుడు తాను అనుకున్నది, చేయదలచినది, నిరాఘాటంగా చేసేసాడు.